హృదయాధిష్ఠానమూర్తి ఒకే రోడ్డు మీద రోజూ ఒకే సమయంలో కలియడం ఎంత చిత్రం? పదకొండో నెంబరు బస్సుగాడన్నపుడు కలిగిన దుఃఖం మరుక్షణమే ఆనందబాష్పాలుగా మారి నా పమిటచెరుగును తడిపేవి.

# సుబ్బమ్మత్త శృంగారవీథి

అచ్యుతరామయ్యగారి అరుగుమీద చెంబులో పేలాలు పోసుకుని ఓ మూల కూర్చుని పరుకూ పరుకూ నములుౖా "ఎవరా వెళ్లేది?" అని రోడ్డుమీద అలికిడి అయితే అడ్డమైన వాళ్లనీ పలకరిస్తూ, చిల్లులుపడ్డ ఆకాశంలావున్న అతుకుల బొంతను కాళ్లమీదేసుకుని కుట్టుకుంటూ "ఊర్మిళాదేవి నిద్ర" - "సీత సమర్త "- "లక్ష్మణ స్వామి నవ్వు" లాటి పాత పాటలు పాడుకొనే "సుబ్బమ్మత్త" మీకు గుర్తుందీ? మనకు పెళ్లయినపుడు అరుగుమీద చింకిచాప మీద చుట్టుకుని కూర్చున్న ముసలమ్మకు తీసుకెళ్ళి దండం పెట్టిస్తే మీకు రెండు ఇచ్చ రూపాయలు తీసి చేతిలో పెట్టి ముఖంమీద చేతులువేసి తడిమిచూసి "అందగాడేనే" అంటే మీరు మరీ సిగ్గుపడిపోతే నాకు నవ్వొచ్చి పక్కుమని నవ్వేస్తే...

"ఆ నవ్వులు కాస్త మొగుడికోసం అట్టేపెట్టే లంజకానా" అని వెన్నుమీద చరిచింది.

తాటి ముంజెలు కొట్టుకు తిన్నట్లు, చెరకు పానకం తాగినట్లు, వియ్యపురాలిజీళ్లు కొసరి కొసరి విరుచుకు తిన్నట్లుండే ఆతిట్లలోని సొగసు- అంటే తెలుగువారి తిట్లలోని కోటిదీవెనల సొగసు తెలుసుకో వాలంటే మచ్చుకి మా "సుబ్బమ్మత్త" లాంటి మూలనున్న ముసలమ్మను కదిలించాలి:

టపేటాసిల్కు గౌనులు, విమానం సిల్కుపావడాలు పట్టు పరికిణీలు, గ్లాస్కోచీరలూ కట్టుకున్న పడుచు పిల్లల మంతా కాలవ కెళ్ళే దారిలో ఎత్తరుగుల మండువాలోగిట్లోకిచేరి కొబ్బరాకు బూరలుచుట్టుకుని, తాటాకుబొమ్మలకు పెళ్లిళ్ళుచేసి గుజ్జనగూళ్లు వండుకుని చెంగుమని గెంతుతూ పాడుతూ కాలక్షేపం చేసేవాళ్ళం;

చెంబులాక్కుని చాపదాచేసి పాతగుడ్డల మూటను పట్టుకుపోయి, ఆవిడతో మీకేమ్రా అంటే వినిపించుకోక నానా అల్లరీ చేసి ఆవిడను కవ్వించి మరీ తిట్లు తినేవాళ్ళం.

"మీ మొహం మండా-"

"మీ అమ్మకడుపు మాడ-"

"తగలెయ్య" - "పిండా కూడు"

"ఛావండి" ఇలాంటి దరిద్రపు తిట్లు ఆవిడ నోట వినలేదు.

"ఓసి నీ యిల్లు బంగారం కానూ"

"కడుపుడక" ఇలా మొదలెట్టి సొగసైన ధోరణిలోకి దిగేది.

"ఏవేఁ లంజా - నీ కెంత మందే పిల్లలూ?"

"మొగుడి కింత తిండి పెడుతున్నావా? ఆ గాడిదకొడుకుని ఏడిపించుకు తింటున్నావా?" అని. అప్పుడే కాపురాని కెళ్ళి పుట్టింటికొచ్చిన కొత్త కాపురం అమ్మాయిని రెండుచేతులతోనూ వొళ్ళంతా తడిమి ఆ పిల్లకి చక్కలిగింతలయి నవ్వితే, ముసలమ్మను త్రోసేసి పారిపోబోతే -

"అలా బుగ్గలు సొట్టలు పడేలా పళ్ళు బయట పెట్టి నవ్వావో, చూస్తూండు వీధిలో ఎవడో ఎగరేసుకు పోతాడు చక్కా" అని మందలించేది.

కొత్త కోడలయినా అంతే-వొళ్ళంతా అరి చేతులతో తడిమి ఆ పిల్ల వయ్యారాలుపోతే "ఏఁవే మొగుడనుకుంటున్నావా" అని మాట విసిరి "పోండి బామ్మగారు" అంటే "లంజకానా తిన్నగా నడవ్వే-ఏవిటా కులుకు?" అని జడ పట్టుకుని గుంజేది.

కార్యంనాడు ఏ జడ వెయ్యాలో మా బామ్మగారు కచ్చితంగా చెప్పేది. మొగలి పూలజడ చమ్కీలు వేసి జడకుప్పెలు పెట్టి కుడితే ఆవిడ ఒప్పుకునేది కాదు.

"ఇదో తిక్కది. ఆ మొగలి పూల జడతో వాడి వొళ్ళంతా గీరుకుపోదూ! అమ్మా మల్లెపూలజడ మెత్తగా వుంటుంది. అది వెయ్యండి" అని సలహా యిచ్చేది.

ఆవిడ పూలజడ స్పెషలిస్టు. ప్రతి పెళ్ళికూతురికీ జడ వేస్తూ నవ్విస్తూ బుజ్జగిస్తూ వీపు మీద చరుస్తూ కబుర్లు చెప్పేది. రహస్యాలు లాగి సుళువులు అడక్కుండా చెప్పేది.

పుస్తకాలు, పత్రికలు, నవలలు, కథలూ రాక ముందు పల్లెటూళ్లో ఆడవాళ్ళ ప్రపంచంలో అదో శృంగార వీథిలా నిండుతనంతో ఆపేక్షలూ అభిమానాలతో పరిమళించి పోయేది.

మొన్నీ మధ్య మా ఊరు వెళ్లేను. ఆ అరుగుమీద ఆ ముసలమ్మ కనబడలేదు. అరుగేవిటి మనసే కాళీగా, చికాగ్గా వుంది. "సుబ్బమ్మత్త" ఏమయిందే వయిందని అడిగాను. మీకు రెండు ఇచ్చు రూపాయలు బహుమానం ఇచ్చి. నాకు కార్యం నాడు పూల జడవేసి వెన్ను మీద చరిచి వేళాకోళాలాడిన సుబ్బమ్మత్త చింకిచాపా, చిరుగుల బొంతా, ఇత్తడి చెంబు ఏవయాయి ఏవయాయనిపించింది నాకు.

సుబ్బమ్మత్తని కాట్లోకి తీసికెళ్లారు.

చింకిచాపని ఏట్లోపారేశారు.

నా మనసులోని మనసులో ఆవిడ సొగసుగా తిట్టినతిట్లు వేయి పారిజాతాల పరిమళం. లక్షమల్లెపూలతావి. కోటి గులాబీల సోయగాలను విరజిమ్మాయి.

"నా చాప ఎత్తుకుపోయి కాలవలో పారేస్తావేఁ లంజకానా. నీకు రెండు డజన్లు పుట్టుకొస్తారు. పుట్టుకొచ్చి ఆ కుర్రముండ లంతా నీ కొంప పీకి, నీయిల్లు ఆగంచేసి నిన్నేడి పించుకు తింటారు." అని మమ్మల్ని తిట్టినట్లు అప్పుడు మేమంతా కేరింతాలు కొట్టి "సుబ్బమ్మత్త" చుట్టూచేరి తప్పట్లు చరిస్తే - చెంబులోంచి పేలాలు తీసిపెట్టి అరటిపళ్ళు వాళ్లూ వీళ్లూ

ఇచ్చినవి మాకు పంచిపెట్టి దాచిన తన వస్తువుల్ని మళ్లీ తెప్పించుకునేది. ఆ అరుగుమీద మేము బొమ్మలాటలు ఆడుకోవటం మానేస్తే మాలో కొందరు కాపరాల కెళ్లిపోతే, కొందర్ని కష్టాలువరిస్తే, కొందరిని కాలం కరిస్తే, అందర్నీ పేరు పేరు వరసలా తల్చుకుంటూ ఆవీధిలో అలికిడి అయితే 'ఎవరా వెళ్ళేది?' అని ప్రశ్నిస్తూ అరుగుమీద కూర్చున్న విగ్రహం. ఆఖరికి తినలేక, అడిగేవారు పెట్టేవారులేక, చివికి చివికి ప్రాణ ముండగానే అంతా వీథిలో పారేస్తే చెట్టుక్రింద మూడురోజులు తీసుకుని తీసుకుని గుటుక్కుమందిట!

పూలజడలువేసి అల్లప్పచ్చడి చేసి పెట్టి ఆ వీథిలోని ఆడపిల్లలందర్నీ పేరుపేరు వరసలా పిలిచి లాలించి అభిమానించి తిట్టి చివరకు ఎవరికీ ఏమీగాకుండా చెట్టుక్రింద కన్ను మూసిందంటే-నాగుండె ఝల్లుమంది:

# పొగ త్రాగరాదు

మీరొక మాటు "సిగరెట్టు కాల్చుకుంటాను అగ్గిపెట్టి పట్రమ్మని" అడిగారు. సిగరెట్టిలా గివ్వండి అంటించి పట్టుకొస్తాను. మీరు సిగరెట్టు తీసి ఇచ్చారు నవ్వుతూ. నేను నీళ్ళ పొయ్యి దగ్గరకెళ్ళి కొబ్బరిడొక్కుతో సిగరెట్టు ముట్టించాను. అప్పుడు నాకు ఒక మాటు షోగ్గామీరు ఎలా పట్టుకుంటారో అలా వేళ్ళ సందున సిగరెట్టు పట్టుకుని పొగ పీల్చాలనే చిలిపి ఊహ కలిగింది. నేను సిగరెట్టు నోట్లో పెట్టుకుని ఒక్కసారి ఎలావుంటుందోనని పొగ పీల్చాను, అంతే - నోటినిండా, ముక్కునిండా పొగ వెళ్ళిపోయి కళ్ళుగిర్రున తిరిగాయి. తూలుతూ తూలుతూ ఆ ఎంగిలి సిగరెట్టు పట్టుకుని గదిలోకివచ్చి మీముందు నిలబడ్డాను. "హో" అంటూ నోరు తెరవమని అడుగుతారనుకున్నాను. అడక్కుండానే నాచేతిలోని సిగరెట్టుని మహద్భాగ్యంగా తీసుకుని అమృతం సేవించినట్టు సేవించారు. నేను సిగరెట్టు కాల్చానని చెప్పకుండానే మీకు తెలిసిపోయివుంటుంది. అప్పుడునాకు పదిహేనో పదహారో... మీ అమ్మతో చెప్పనా... మీనాన్నతో చెప్పనా... అంటూ బెదిరించేవారు నన్ను: "పొగత్రాగిన ప్రేయసి" అంటూకథ రాస్తానని వుడికించేవారు నన్ను. కాని ఆ వేళ నేను మీకిచ్చిన ఎంగిలి సిగరెట్టు - అటువంటి సిగరెట్టుకాల్చి జన్మతరించి పోయినట్టు మీరు లోలోన మురిసిపోయి వుంటారు. మానాన్నతో ఎక్కడ చెబుతారోనని నేను మిమ్మల్ని కళ్లతో ఎంతగా వేడుకునేదాన్నో ఓమారు గుర్తు చేసుకోండి!

ఆ లిపిలేని కళ్ళభాషముందు రేడియో టెలిగ్రాము, టెలివిజన్లు ఎందుకు పనికొస్తాయి? కొత్త పెళ్లికూతురు తనమనసులోని భావాలను, ఆశలను కళ్ళ భాషతో చెప్పుకునేటప్పుడు ఏ పెళ్ళికొడుకేనా అర్థంచేసుకోలేకపోతే ఆ ఇడియట్‌కి ఇచ్చిన కట్నం తిరిగి పుచ్చేసుకుని నాలుగు